## క్లుప్తంగా

### శాకంబరిగా అమ్మవారు



శాకంబరి అలంకరణలో అమ్మవారు

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలోని సాలిపేటలో కొలువైన లలితా నవదుర్గా పరమేశ్వరిదేవి అమ్మవారిని శుక్రవారం శాకంబరిగా అలంకరించారు. గ్రామంలోని సత్తెమ్మ తల్లి పీఠంలో ఆషాఢ మాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని ఈ ప్రత్యేక అలంకరణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

### క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు




విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ మూర్తి

రాజానగరం: విద్యార్థి దశలో అలవర్చుకున్న క్రమశిక్షణ జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళుతుందని జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్పీ మూర్తి అన్నారు. నామవరంలోని భారతీయ విద్యాభవన్‌ను ఆయన శుక్రవారం సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణను అలవర్చుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

### చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ కొంకుదురు పీవీ

బిక్కవోలు: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు కొంకుదురు పీవీ అన్నారు. కొంకుదురు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కిట్లను సద్వినియోగం చేసుకోని చక్కగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలోని మాజీ సర్పంచ్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అలాగే కొంకుదురు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్లు అందజేశారు. బిక్కవోలు ఉన్నత పాఠశాల టీడీపీ నాయకుడు పల్లె శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ గొర్రెల త్రిమూర్తులు, చొదరి తదితరులు పంపిణీ చేశారు.

### మణిశర్మ దంపతులకు సన్మానం



మణిశర్మ దంపతులను సన్మానిస్తున్న చైతన్యరాజు

రాజానగరం: ఎన్నో సినిమా పాటలకు అద్భుతమైన సంగీతాన్ని అందించిన మణిశర్మ అందరికీ సుపరిచితులేనని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) అన్నారు. గైట్ కళాశాలలో గురువారం రాత్రి మణిశర్మ దంపతులను చైతన్యరాజు దంపతులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

### ఎంపీపీకి అభినందనలు



బిక్కవోలు ఎంపీపీ బుద్దాల కన్నారావును అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు

బిక్కవోలు: మండలంలోని నూతన ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీపీ బుద్దాల కన్నారావును ప్రజాపతినిధులు అభినందించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన కలిసి పూల మొక్కను అందించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రొంగల పద్మావతి, తొస్సిపూడి ఎంపీటీసీ తేతలి సుమ, కర్రి గీతా సావిత్రి, మచ్చ పాప తదితరులు ఉన్నారు.

# హుషారుగా సాగుతూ..

- జోరుగా ఖరీఫ్ పనులు
- ముమ్మరంగా వరినాట్లు
- అనపర్తి నియోజకవర్గంలో 54 వేల ఎకరాల్లో వరిసాగు



ఊలపల్లిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

బిక్కవోలు: నియోజకవర్గంలో ఖరీఫ్ పనులు ఊపందుకుంటున్నాయి. పలు గ్రామాల్లో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. వర్షాభావం ఉన్నప్పటికీ చెరువులు, కాలువల నీటితో సాగు పనులు మొదలుపెట్టారు. కాలువలకు పూర్తి స్థాయిలో నీరు విడుదల చేయడంతో వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. దీంతో గ్రామాల్లో వాతావరణం సందడిగా మారింది. ఎక్కడ చూసినా పొలాలలో పనులు జరుగుతున్నాయి. అనపర్తి నియోజకవర్గంలో ఈ ఏడాది సుమారు 54 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 32 వేల ఎకరాల్లో సాగు పనులు పూర్తయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. జూలై 30 నాటికి పూర్తి స్థాయిలో వరినాట్లు పూర్తవుతాయని వివరించారు. రైతులు త్వరితగతిన నాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు.

**యాంత్రీకరణ**

వ్యవసాయంలో యాంత్రీకరణ విధానాలతో ఖర్చులు బాగా తగ్గనున్నాయి. అలాగే మంచి దిగుబడులు సాధించేందుకు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలను రైతులు పాటించాలి. ముఖ్యంగా వరి వంగడాలకు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి. తద్వారా పంటను తెగుళ్ల బారి నుంచి రక్షించుకోవచ్చు. అలాగే అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడం వల్ల పంటకు హాని జరుగుతుంది. రైతులకు పెట్టుబడి పెరగడంతో పాటు భూసారం దెబ్బతినే అవకాశం ఉంది.

**వెదజల్లుకు మొగ్గు**

నియోజకవర్గంలో అధిక శాతం రైతులు వెదజల్లు పద్ధతిలో వరిని సాగు చేస్తున్నారు. బోర్ల కింద నారు మడులు పెంచిన రైతులు మాత్రం వరి నాట్లు వేయిస్తున్నారు. ఒక పక్క దమ్ములు, మరో పక్క వరినాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

**సలహాలు పాటించాలి**

ఖరీఫ్ సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మొలక కట్టిన విత్తనాలను సెంటుకు ఐదు కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో 3 దఫాలుగా దమ్ము చేయాలని, అనంతరం చదును చేసి నీరు పెట్టడానికి తీయడానికి వీలుగా కాలువను ఏర్పాటు చేయాలని సూచించారు. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం ఇచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. నారు ఒక ఆకు పూర్తిగా పురి విచ్చుకునే వరకూ ఆరు తడులు పెట్టాలని, జింకు లోపాన్ని గమనిస్తే లీటర్ నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు.


**జాగ్రత్తలు తప్పనిసరి**



నాట్లు వేసినప్పుడు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. నారు వేసిన 21 రోజుల నుంచి 25 రోజుల తర్వాత కుదురుకు మూడు నుంచి నాలుగు మొక్కల చొప్పున నాట్లు వేసుకోవాలి. నాటే ముందు మొక్కల కొనలను తుంచితే కాండం తొలిచే పురుగు బెడదను నివారించవచ్చు. ఒక చదరపు మీటర్‌కు 33 కుదుళ్ల వచ్చేటట్టు నాట్లు వేసుకోవాలి.

– శామ్యూల్ జాన్, వ్యవసాయాధికారి, బిక్కవోలు

### కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు



చంద్రేడులో కొలువైన కనకదుర్గమ్మ

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కొలువైన శ్రీదేవి కనకదుర్గ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా మండల కేంద్రమైన రంగంపేట మంచినీటి చెరువు వద్ద ఉన్న విజయ దుర్గాంబిక ఆలయంలో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## చెరువు భూమి కబ్జాకు రంగం సిద్ధం!

- రంగంపేటలో ప్రభుత్వ భూమికి రెక్కలు
- 90 సెంట్ల ప్రభుత్వ భూమి కాజేసేందుకు యత్నాలు

రంగంపేట: చెరువు భూమిని మింగడానికి తిమింగళాలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వం మారడంతోనే భూములపై భూరాబంధులు వాలిపోతున్నాయి. మండల కేంద్రమైన రంగంపేటలో స్థానిక పద్దరాజు చెరువుకు చెందిన సర్వే నంబరు 506లో 90 సెంట్ల భూమి కబ్జాకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వం మారిన వెంటనే రంగంపేటలో భూరాబంధులు తిరిగి తెరపైకి వచ్చాయి. ప్రభుత్వ భూమి కాజేసేందుకు గతంలో చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో తిరిగి కొత్త ప్రయత్నాలు మొదలుపెట్టాయి. ప్రభుత్వ భూమికి రెక్కలు రావడం ఖాయమని స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించి గ్రామానికి చెందిన ఇద్దరు నాయకులు ఇప్పటికే తమ పనులు ప్రారంభించారు. ముందుగా వ్యవసాయం పేరుతో భూమిని సదును చేయడంతో గుసగుసలకు ఆజ్యం పోస్తుంది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం గ్రామానికి చెందిన 506 సర్వే నంబరులో పద్దరాజు చెరువుకు చెందిన 5.87 ఎకరాల్లోని 90 సెంట్లు భూమిని ఇప్పటికే కబ్జాదారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దీనిని పూర్తిగా ఆక్రమించి ప్లాట్లుగా విభజించి అమ్మకాలు జరిపేందుకు వ్యూహరచన కూడా చేశారు. దీనికి అధికారులతో పాటు, అధికార పార్టీ నేతల అండదండల కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే ఈ భూమిని భూ కబ్జాదారులకు దక్కకుండా ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడేలా చూడాలని, ప్రభుత్వ పరంగా కాకపోయినా న్యాయ స్థానాన్ని ఆశ్రయించైనా ఈ భూమిని కాపాడాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## ప్రజాప్రతినిధులను గౌరవించాలి

- అధికారులకు సూచించిన ఎంపీపీ
- మండల సర్వసభ్య సమావేశం




సమావేశంలో మాట్లాడుతున్నా ఎంపీపీ కన్నారావు

బిక్కవోలు: ప్రజలకు సేవలందించే ప్రజాప్రతినిధులను అధికారులు గౌరవించాలని ఎంపీపీ బుద్దాల కన్నారావు అన్నారు. స్థానిక మండల పరిషత్‌లో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల వారీగా నివేదికలు అందించారు. ఈవోపీఆర్డీ భవాని మాట్లాడుతూ మండలంలోని ఇంటి పన్ను ద్వారా రూ.46,01,348 వసూలు చేయాల్సి ఉండగా రూ.2,64,581 మాత్రమే వచ్చిందని, రూ.43,36,767 వసూళ్లు చేయాల్సి ఉందన్నారు. టాక్స్ ద్వారా రూ.18,72,088 వసూలుకు గాను రూ.1,63,206 వసూళ్ల చేయడంతో ఇంకా రూ.17,08,882 రావాల్సి ఉందన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కిట్ల పంపిణీ చేశామన్నారు. దీంతో మెళ్లూరు–ఆరికరేవుల ఎంపీటీసీ కొర్ర చక్రధరరావు మాట్లాడుతూ మెళ్లూరు అంగన్‌వాడీ భవనాం నిర్మాణ దశలో ఉందని వాటిని పూర్తి చేయాలన్నారు. కొంకుదురు ఎంపీటీసీ కొంకుదురు పి.వి.కాపవరం ఎంపీటీసీ భీష్ముడు, కొంకుదురు సర్పంచి సత్తి వీరమణి మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది కిట్ల పంపిణీ విషయంలో మాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదన్నారు. దీంతో ఎంపీపీ కన్నారావు మాట్లాడుతూ అధికారులు సమాచారం లేకుండా కిట్ల పంపిణీ చేయడం తప్పు అని పార్టీతో సంబంధం లేకుండా ప్రజాప్రతినిధులు సమాచారం అందించడంతో మీడియా ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇరుగేషన్ అధికారులు కాలువ వద్ద గుర్రపు డెక్క తొలగించడమే కాకుండా తూములు వద్ద కూడా చెత్త తొలగించాలన్నారు. ఆర్టీసీ సూపర్‌వైజర్ ఎ.సత్యనారాయణ మాట్లాడుతూ సినియర్ సిటిజన్ ఆర్టీసీ కల్పిస్తున్న రాయితీ గురించి వివరించారు. కొంకుదురు ఎంపీటీసీ పివి మాట్లాడుతూ రామచంద్రపురం నుంచి మండలంలోని మెళ్లూరు, ఆరికరేవుల, కొంకుదురు, పందలపాక, ఊలపల్లి,బిక్కవోలు మీదగా సామర్లకోట బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే వివిధ శాఖ అధికారులు ప్రగతి వివరించారు. ఈ కార్యక్రమంలోని జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, వైస్ ఎంపీపీ పెంకె మంగయ్యమ్మ, మండల ప్రత్యేక అధికారి కె.విజయకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో రత్నకుమార్, తహసీల్దార్ కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

## గాడాల హైస్కూల్‌కు సామగ్రి వితరణ



జోస్ అలుక్కాస్ మేనేజర్ జియోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు జోస్ అలుక్కాస్ మేనేజర్ జియో శుక్రవారం రూ.60 వేలు విలువైన సామగ్రిని వితరణ చేశారు. విద్యార్థుల కోసం రెండు కంప్యూటర్లు, 15 కుర్చీలు, 15 టేబుళ్లు, ఆట వస్తువులను స్కూల్ హెచ్ఎం నిర్మలా జ్యోతికి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ జోస్ అలుక్కాస్ సంస్థ మేనేజర్ జియో ప్రభుత్వ పాఠశాలలకు వితరణ చేసి దాతృత్వాన్ని చాటుకున్నారని అభినందించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు.

## ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, అర్థశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ పరిమితికి మించిన జనాభాతో అనేక సమస్యలు ఏర్పడతాయన్నారు. అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ డీవీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు లేని నాణ్యమైన మానవ వనరులే దేశ పురోగతికి సాధనాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.సుధామయి మాట్లాడుతూ దేశ జనాభాను క్రమంగా నియంత్రించుకుంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరేరామకృష్ణ, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ మాధవ్, సుబ్బారావు, అలేఖ్య, మీనాక్షి, ఫణీంద్ర, వాణి పాల్గొన్నారు.

### వీల్ చైర్లు, చేతి కర్రల వితరణ



బుచ్చెంపేటలో చేతికర్రలను పంపిణీ చేసిన హెల్పేజ్ సంస్థ

మధురపూడి: కోరుకొండ మండలంలోని వృద్ధులు, దివ్యాంగులకు హెల్పేజ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ వీల్ చైర్లు, వాకర్లు, చేతి కర్రలను వితరణ చేసింది. బూరుగుపూడి, బుచ్చెంపేట, గాడాల, బొల్లెద్దుపాలెం, గరగలం పాలెం తదితర గ్రామాల్లో బుధ, గురు, శుక్రవారాల్లో వీటిని పంపిణీ చేశారు. సంస్థ అధికారి టి.షెడ్రాక్, ఇన్‌చార్జి బేబీ, డైరెక్టర్ యతేంద్ర యాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు పదో తరగతి కీలకం



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

రంగంపేట: ప్రతి విద్యార్థికీ పదో తరగతి కీలకమని, ఈ దశలో రాణించిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. శుక్రవారం మర్రిపూడి గ్రామంలోని పుట్టా శ్రీనివాస్ స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి కుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి, గ్రామ పెద్దలు మోదుకూరి సత్తిరాజు, దువ్వ సూరిబాబు, పల్లె ప్రభాకర్, కందుకూరి శ్రీను, పుట్టా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేత



కుతుకులూరులో విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందిస్తున్న నాయకులు

పెదపూడి: కుతుకులూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు భోజనం చేసేందుకు అవసరమైన కంచాలు, గ్లాసులు అందించారు. శుక్రవారం గ్రామానికి తేతలి ఆదిరెడ్డి జ్ఞాపకార్థం వారు కుమారులు సమర్పించి ఈ ప్లేట్లు, గ్లాసులు గ్రామ సర్పంచి గొల్లు హేమ తులసి అందించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు భోజనం ప్లేట్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలోని తేతల వీరరాఘవరెడ్డి, కొవ్వూరి రామారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట సుబ్బారెడ్డి, కర్రి చిన్నారెడ్డి, ఎస్పీ తమలంపూడి రామారెడ్డి, తమలంపూడి శ్రీధర్‌రెడ్డి, గొల్లు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు

మధురపూడి: కోరుకొండ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో శుక్రవారం కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించారు. సుమారు 8 మందికి మహిళలకు ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ ప్రగ్న మాట్లాడుతూ డీఎంహెచ్ఓ కె.వెంకటేశ్వరరావు సూచనల మేరకు ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు ప్రారంభించామన్నారు. వీటిని కొనసాగిస్తామని తెలిపారు. ఆపరేషన్లలో కోటికేశవరం పీహెచ్‌సీ వైద్యులు శ్రీవల్లీ, సీతానగరం పీహెచ్‌సీ వైద్యులు ఏవీకే చైతన్య సహకారం అందించారన్నారు.

### రంగస్థల నటుడు తాడి సుబ్బారెడ్డికి కళా పురస్కారం



కాకినాడలో కళా పురస్కారం అందుకున్న సుబ్బారెడ్డి

పెదపూడి: పాలమూరు గ్రామానికి చెందిన రంగస్థల నటుడు తాడి సుబ్బారెడ్డికి కాకినాడలో కళా పురస్కారం అందజేశారు. శుక్రవారం కాకినాడలో సూర్య కళా మందిరంలో అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పంపన దయానంద్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటికల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్బారెడ్డిని ఘనంగా సత్కరించారు.

### నేడు విద్యుత్ అంతరాయం

మధురపూడి: కోరుకొండ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. కోరుకొండ, పశ్చిమగానుగూడెం, జంబూపట్నం, నర్సాపురం, గాదరాడ, కణుపూరు, రాజవరం, కాపవరం, మునగాల, శ్రీరంగపట్నం, రాఘవపురం, కోటికేశవరం, కోటి, బొల్లెద్దుపాలెం, గరగలం పాలెం, గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి, అచ్యుతాపురం, వెదురుపాక, బావాజీపేట, తిరుమలాయపాలెం గ్రామాలకు ఆ సమయంలో సరఫరా ఉండదన్నారు.

సీతానగరం: ముగ్గళ్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నేపథ్యంలో శనివారం 11 కేవీ ఫీడర్లకు సరఫరా నిలిపివేస్తామని ఎగ్జిక్యూటిక్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ తెలిపారు. దీనితో కాటవరం, జాలిమూడి, వెదుళ్లపల్లి, మునికూడలి, రాజంపేట, ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల, రఘుదేవపురం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ ఉండదన్నారు.

రంగంపేట: వార్షిక మర్మతుల కారణంగా స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని రాజమహేంద్రవరం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, వెంకటాపురం, సుభద్రంపేట, దొడ్డిగుంట, గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ సెక్షన్ కరకుదురు11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కాకినాడ విద్యుత్తు శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ జి.ప్రసాద్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కరకుదురు, దోమాడ, పెదపూడి, ఏపీత్రయం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

# నగరంలో క్రీడోత్సవం

- టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం
- తరలివచ్చిన క్రీడాకారులు
- మూడు రోజుల పాటు నిర్వహణ



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా టీటీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు భాస్కర రామ్

ప్రకాశం నగర్: క్రీడలపై యువతకు ఆసక్తి పెరుగుతోంది. దానికి పోత్సాహం కూడా తోడవడంతో అనేక మంది ఆటలపై ఆసక్తి చూపుతున్నారు. చదువులో పాటు క్రీడలపై మక్కువ చూపుతున్నారు. దీంతో తరచుగా అనేక చోట్ల టోర్నమెంట్లు జరుగుతున్నాయి. ముఖ్యంగా నగరం క్రీడాపోటీలకు వేదికవుతోంది. ఇక్కడి చిన్నారులు, యువత ఆటలలో ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో కూడా రాణిస్తున్నారు.

**టేబుల్ టెన్నిస్ పోటీలు**

ప్రస్తుతం నగరం టేబుల్ టెన్నిస్ పోటీలకు వేదికైంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులతో సందడిగా మారింది. స్థానిక నారాయణపురంలోని ఆర్ఎంసీ సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో శుక్రవారం ఏపీ స్టేట్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సుమారు మూడు రోజుల పాటు వీటిని నిర్వహించనున్నారు. పది టేబుళ్లపై 25 మంది అంపైరింగ్ సిబ్బందితో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు సుమారు 12 విభాగాలలో తలపడనున్నారు. మొదటి రోజు అండర్ - 17 బాలురు, బాలికలు, అండర్ -19 పురుషులు, స్త్రీల విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీలను జిల్లా టీటీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు విశ్వనాథం భాస్కర్ రామ్, ఉపాధ్యక్షుడు విజయ్ ప్రకాశ్ ఈ పోటీలను ప్రారంభించారు.

**జాతీయ పోటీలకు ఎంపిక**

ఏపీ స్టేట్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో సుమారు వివిధ విభాగాల్లో పాల్గొన్న క్రీడాకారులకు వారు సాధించిన పాయింట్ల ఆధారంగా వారికి ర్యాంకింగ్ ఇచ్చి ఆయా విభాగాల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. విజేతలకు నగదు బహుమతితో పాటు పతకాలు అందించనున్నారు. శుక్రవారం ప్రారంభమైన సీనియర్ విభాగాలకు శనివారం సాయంత్రం బహుమతులు అందజేయనున్నారు. విజేతలు నగదు బహుమతి పాటు, పతకాలను అందిస్తారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.



టేబుల్ టెన్నిస్‌లో తలపడుతున్న క్రీడాకారులు

**ప్రతిష్టాత్మకంగా పోటీలు**

ఏపీ స్టేట్ టేబుల్ టెన్నిస్ పోటీలను రెండోసారి రాజమహేంద్రవరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలోని పలు ప్రాంత్రాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు ఈ పోటీలో తలపడుతున్నారు. మూడు రోజులు జరిగే పోటీలు జరగనునున్నాయి. పోటీల నిర్వహణ, విజేతల ఎంపికలు పారదర్శంగా నిర్వహిస్తున్నాం. క్రీడాకారులు ఇలాంటి టోర్నమెంట్లను సద్వినియోగం చేసుకోవాలి.

– విశ్వనాథం భాస్కరరామ్, జిల్లా టీటీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు